ఎస్మాకు ఎదురొడ్డి.. పోరాటం

- కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె
- ప్రభుత్వ శవయాత్ర, దిష్టిబొమ్మ దహనం
- అవసరమైతే రాష్ట్ర బంద్‌కు సిద్ధం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య
- ఎస్మా ప్రయోగానికి అధికారులు సిద్ధం
- అంగన్వాడీ కేంద్రాలు తెరవాలని ఆదేశాలు


రాయచోటిలో జాతీయ రహదారిపై పొర్లుదండాలు పెడుతున్న అంగన్వాడీలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవల కిందకు వచ్చే ఉద్యోగులు, కార్మికులు సమ్మెలోకి వెళ్లకుండా ఉండేందుకు ఉద్దేశించిన ఎస్మా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లపై ప్రయోగించింది. సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అయితే అంగన్వాడీలు ఎస్మాకు ఎదురొడ్డి పోరాడుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నా వెనక్కు తగ్గేది లేదని సమ్మెను కొనసాగిస్తున్నారు. సోమవారానికి సమ్మె 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు జోరు వానను సైతం లెక్కచేయకుండా గొడుగులు చేతబట్టి నిరసన తెలుపుతూ పలుచోట్ల ఎస్మా చట్టం జీవోను దగ్ధం చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం సైతం ఎస్మా ప్రయోగానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంగన్వాడీ కేంద్రాలను తెరిచేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవోలకు ఆదేశాలు జారీ చేసింది.

- రాష్ట్రంలో 26 రోజుల సమ్మె తర్వాత అంగన్వాడీలు అత్యవసర సేవలన్నీ గుర్తించారా సమ్మె నోటీసు ఇచ్చినప్పుడే ఎందుకు గుర్తుకు రాలేదని, ఇప్పుడు ఎస్మా అంటూ ముఖ్యమంత్రి మరో నాటకానికి తెరతీశారని, అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి అవసరమైతే వామపక్షాలు రాష్ట్ర బంద్‌కు సిద్ధంగా ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వం శవయాత్ర పెట్టి దిష్టిబొమ్మ దహనం చేశారు. అంగన్వాడీలకు డెడ్‌లైన్, ఎస్మా బెదిరింపులు మానుకుని ఇచ్చిన హామీలు అమలు చేసి అంగన్వాడీలను ఇతర మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- రాయచోటి కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు సోమవారం దీక్షలు కొనసాగించారు. జాతీయ రహదారిపై పొర్లుదండాలతో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సోమవారం జరిగిన దీక్షల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మిదేవి అధ్యక్షతన జరిగాయి. ఈ దీక్షల్లో మదనపల్లె, నిమ్మనపల్లెకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు. దీక్షా శిబిరం వద్ద నృత్యాలు, పాటలు, డప్పు మోతలతో దద్దరిల్లిపోయింది. కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై అంగన్వాడీ వర్కర్లు భారీ సంఖ్యలో పడుకుని జోరువానలో పొర్లు దండాలతో ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని నిరసన తెలిపారు.
- రైల్వేకోడూరులో అంగన్వాడీలు, ఆయాలు రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షం పడుతున్నా లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని ధర్నా చేశారు. అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.
- రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జరిగిన దీక్షల్లో పలువురు పాల్గొన్నారు. ఎస్మాతో తమను బెదిరించలేరని, డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, శివరంజని, అమరావతి, విజయ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలి వద్ద రిలే దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షల్లో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమని, వెంటనే దానిని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యెం మండలాలకు చెందిన అంగన్వాడీలు, ఆయాలు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే దీక్షలు కొనసాగించారు. వర్షంలో సైతం గొడుగులతో నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిదిలోని అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.
- బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన దీక్షా శిబిరంలో యూనియన్ నాయకురాళ్లు శ్రీవాణి, చాంద్‌బీ, కుమారిలు మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని.. పోరాడుదాం.. సాధిద్దాం.. అంటూ నినాదాలు చేశారు. వర్షంలో గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. జీవో ప్రతులను దహనం చేశారు.
- మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రామసముద్రం మండలానికి చెందిన అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్మాకు భయపడమని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు తెరిచేలా చర్యలు..

సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందని ఈ క్రమంలో జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు తిరిగి తెరుచుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారి దేవళ్ల శశికళ సీడీపీవోలను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలు తెరుచుకునేలా సీడీపీవోలు అన్ని చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

- దేవళ్ల శశికళ, జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారి


రాయచోటిలో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర చేస్తున్న అంగన్వాడీలు



బి.కొత్తకోట, తంబళ్లపల్లెలో గొడుగులు పట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

చంద్రబాబు సభ కోసం స్థల పరిశీలన చేస్తున్న కిశోర్, పీలేరు నాయకులు



ఎమ్మెల్యేల బదిలీలతోనే జగన్ ఓటమి

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, జనవరి 8: ప్రభుత్వ అధికారుల తరహాలో ఎమ్మెల్యేలు, ఎంపీలను బదిలీ చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ ఓటమి నిర్ధారణ అయిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. పీలేరులో సోమవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అధికార మదం తలకెక్కిన జగన్ ప్రభుత్వ అధికారులను ఇష్టమొచ్చిన చోటుకు బదిలీ చేసిన విధంగా ప్రజల మద్దతుతో గెలవాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలను కూడా బదిలీ చేయవచ్చు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన చేసిన విధ్వంసకర పాలన చూసిన రాష్ట్ర ప్రజలందరూ 'ఏపీ హేట్స్ జగన్' అంటున్నారని తెలిపారు. పీలేరు మండలంలో ఏర్పాటైన జగనన్న కాలనీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని తాను గతంలోనే పలుమార్లు హెచ్చరించానని, ఏపీఐఐసీ 3వ లేఔట్‌లో రెవెన్యూ అధికారుల విచారణలో అది నిజమని తేలిందని కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా ఉన్న జాహ్నవి తన విచారణలో పీలేరు పట్టణ పరిసరాల్లో సుమారు 600 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని కిశోర్ గుర్తు చేశారు. ఆమెను ఉన్నఫళంగా బదిలీ చేసి ఆ అంశాన్ని మరుగుపరిచారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెడతామని ప్రకటించారు.

24న పీలేరులో చంద్రబాబు సభ

'రా...కదిలిరా' కార్యక్రమంలో భాగంగా ఈనెల 24వ తేదీ పీలేరులో చంద్రబాబు నాయుడు సభ ఉంటుందని కిశోర్ తెలిపారు. సభ నిర్వహణ కోసం సోమవారం ఆయన స్థానిక నేతలతో కలిసి పీలేరు-మదనపల్లె మార్గంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన 'రా...కదిలిరా' సభకు అనూహ్య స్పందన వచ్చిందని, ఆ సభకు తీసిపోని విధంగా పీలేరులో కూడా సభ విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఏపీఐఐసీ సమీపంలోని కొన్ని ప్రైవేటు భూములను సభ నిర్వహణ కోసం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, మల్లెల రెడ్డిబాషా, శ్రీకాంత్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, అమరనాథరెడ్డి, రామ్మూర్తి, రవికుమార్, మనోహర, సహదేవ, రియాజ్, ఫిరోజ్, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

రైతులు, యువతను ముంచిన ప్రభుత్వం

- టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 8 : ఎన్నికలకు ముందు లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఉద్యోగులను, రైతులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నట్టేట ముంచారని టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి టీడీపీ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా, ఉచితంగా ఎరువులతో పాటు కొన్ని పురుగుల మందులను ఇచ్చేదని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేదన్నారు. ఉద్యాన పంటల సాగు రైతుల పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వంలో దయనీయంగా మారిందన్నారు. గత టీడీపీ హయాంలో దెబ్బతిన్న మామిడి తోటల పునరుద్ధరణ, కలుపుతీత పనులకు ఉద్యాన రైతులకు హెక్టారుకు రూ.17 వేల చొప్పున నగదు అందజేసేదని, ప్రస్తుతం ఎంత మొరపెట్టుకున్నా ఆ స్కీంలు లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో గ్రామ యూనిట్ ఆధారంగా రైతుకు ఇన్సూరెన్స్ అందజేశారని, ప్రస్తుతం వాతావరణ బీమా ద్వారా రైతుకు పూర్తి స్థాయిలో నష్టం తప్ప లాభం లేదన్నారు. ప్రతి రూపాయి రైతు పెట్టుబడి పెట్టుకుని మార్కెట్‌లో సరైన ధరలు లేకపోవడంతో పాటు తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కూడా నష్టపోతున్న రైతన్నకు వైసీపీ ప్రభుత్వం అండగా ఉండటం లేదని తెలిపారు. అదేవిధంగా యువత భవితను చీకట్లోకి నెట్టిన ఘనత జగన్‌దే అన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు తెస్తే ఈ ప్రభుత్వంలో గంజాయి మాఫియాను తెచ్చారని, గత ప్రభుత్వంలో టీచర్ ఉద్యోగాలు ఇస్తే జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి వలంటీరు ఉద్యోగాలు, చికెన్, మటన్ మార్ట్ ఉద్యోగాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నేసుబ్బనరసయ్యనాయుడు, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, సతీష్‌రాజు, పార్లమెంటు మైనారిటీ సెల్ నాయకులు కరీముల్లా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరుపుల దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ.25 లక్షల ఆస్తినష్టం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచోటిటౌన్, జనవరి 8: రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రోడ్డులో గల రింగు రోడ్డు పక్కన సోనీ మ్యాట్రెస్ అనే పేరుతో ఉన్న పరుపుల దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పరుపులు పూర్తిగా కాలిపోయి రూ.25 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు బాలాజి తెలిపారు. రాయచోటి పట్టణానికి చెందిన హెల్మెట్ నిసార్ రూముల్లో ఒక్క రూంలో కొద్ది నెలల క్రితం బాడుగకు సోనీ మ్యాట్రెస్ వారు నూతనంగా పరుపుల వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణంలో పరుపులన్నీ పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే దుకాణంలో ఉన్న సరుకు మొత్తం కాలి బూడిదైంది. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. ఇతను ప్రతిరోజూ కడప నుంచి రాయచోటికి వచ్చి వ్యాపారం చూసుకుని వెళ్లేవాడు.

అటవీ ప్రాంత పరిధిలో ఉపాధి హామీ పనులు : జేసీ

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 8: జిల్లాలో అటవీ ప్రాంత పరిధిలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ డ్వామా, అటవీశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ నిధులతో అటవీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులపై జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అటవీ ప్రాంత పరిధిలో నిబంధనల మేరకు ఉపాధి హామీ పనులను చేపట్టి శాశ్వతమైన ఆస్తులను ఏర్పాటు చేసేందుకు అటవీ, డ్వామా శాఖలు సమన్వయంగా కృషి చేయాలన్నారు. ఇందుకు నగరవనం, ఫారెస్ట్ ఫైరింగ్ జోన్‌లో నేల తేమ సంరక్షణ, కొత్త అమృత సరోవర్లు, ఊటకుంటలు ఇతర నీటి కుంటలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించాలని అటవీ శాఖాధికారులను ఆదేశించారు. ఇదివరకే అటవీ ప్రాంతంలో ఉన్న చెక్‌డ్యాంలు పర్క్యులేషన్ ట్యాంకులలో ఉపాధి హామీ కింద పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అవసరమైన పనులు చేపట్టే నిమిత్తం అటవీ, డ్వామా శాఖలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను గుర్తించాలన్నారు. ఇందులో మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, పది రోజుల్లోగా పనులను గుర్తించి మంజూరు నిమిత్తం ప్రతిపాదనలను సమర్పించాలని జేసీ తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వోలు నాగమనేశ్వరి, వివేక్, సబ్ డీఎఫ్‌వోలు శుభమ్, శ్రీనివాస్, డ్వామా ఏపీడీలు రవి, నందకుమార్‌రెడ్డి, అటవీ, డ్రామా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు స్మగ్లర్ల అరెస్ట్

- వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 8: తమిళనాడుకు చెందిన ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు... సానిపాయ అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా తమిళనాడుకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు రహస్య సమాచారం అందిందన్నారు. దీంతో తాము ఆదివారం రాత్రి పీలేరు సమీపంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో అటువైపు వేగంగా వచ్చిన ఏపీ28 బీవీ 6370 నెంబరు గల ఫోర్డ్ ఫీస్టా వాహనం తాము ఆపినా ఆపకుండా ఆగకుండా చిత్తూరు వైపు వెళ్లిపోయిందన్నారు. అనుమానంతో తాము దానిని వెంబడించగా అశోక్ నగర్ కాలనీ వద్ద కారు డ్రైవర్, మరో వ్యక్తి కారులో నుంచి పారిపోయారన్నారు. కారులో ఉన్న తమిళనాడుకు చెందిన వేలురత్నం, శక్తివేలు, రామదొరై ఈశ్వరన్, కుప్పన్, నగేషన్ అరుణాచలం, విజయకుమార్, శ్రీనివాస పెరియ పయన్‌లను తాము అదుపులోకి తీసుకుని కారును తనిఖీ చేయగా అందులో 370 కిలోల బరువున్న 12 ఎర్రచందనం దుంగలు దొరికాయన్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా పారిపోయిన వారిలో ఎర్రచందనం కూలీలకు మేస్త్రీగా వ్యవహరించే తమిళనాడు రాష్ట్రం, జమునా పుత్తూరుకు చెందిన మురుగేషన్‌గా గుర్తించామన్నారు. డ్రైవర్ ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. దాడిలో తనతో పాటు ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ప్రభుతేజ, చరణ్, సుబ్రహ్మణ్యం, మల్లిఖార్జున పాల్గొన్నట్లు వెంకటరమణ తెలిపారు.


పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలు, కారుతో పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

అకాల వర్షం.. మామిడికి నష్టం...


- వర్షంతో పూతలు మాడిపోయే ప్రమాదం
- వాతావరణ మార్పులే కారణమని చెబుతున్న శాస్త్రవేత్తలు
- గత ఏడాది అరటి, ఈ ఏడాది మామిడి
- ప్రకృతి ప్రకోపంతో రైతులు విలవిల


అకాల వర్షంతో మాడిపోయిన మామిడి పూతలు

రైల్వేకోడూరు, జనవరి 8: అకాల వర్షంతో మామిడి రైతుకు కష్టాలు ప్రారంభమయ్యాయి. వచ్చిన పూతలు వర్షం దెబ్బకు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా అప్పుడప్పుడు చిరుజల్లులు కురుస్తున్నాయి. అయితే సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తరుగా వర్షం పడుతూనే ఉంది. వాతావరణ మార్పులతో మామిడి పూత మాడిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అకాల వర్షాలు తరచూ కురుస్తున్నాయి. దీంతో మామిడి రైతులకు నష్టాలు తెచ్చే విధంగా వాతావరణ పరిస్థితులు మారాయి. గత ఏడాదిలో భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో అరటి కుప్పకూలిపోయింది. ఈ ఏడాది జనవరిలో కురుస్తున్న అకాల వర్షాలతో మామిడి పంట దెబ్బతింటోంది. రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రతి ఏటా సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో వర్షాలు కురుస్తాయి. అయితే గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు కురవడం, మంచు విపరీతంగా పడటంతో ఎక్కువగా నేలలో తేమ శాతంతో మామిడి పంటకు దెబ్బతింది. ఈ ఏడాది డిసెంబరు మాసం నుంచి పూతలు నిలువడానికి రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేశారు. ఎక్కువగా మధ్య తరగతి రైతులు, వ్యాపారుల దగ్గర పంట సాగు కోసం పెట్టుబడి తీసుకున్నారు. పూతలు రాక మునుపు దున్నకాలు, ఎరువులు, కూలీలు తదితర వాటికి ఎకరాకు రూ.10 వేలు, మందుల పిచికారీకి ఇప్పటికే రూ.5 వేల వరకు ఖర్చు అయిందని రైతులు తెలిపారు. మామిడి రైతులకు ప్రతి ఏటా వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయి. గత ఏడాది దిగుబడులు బాగానే వచ్చాయి. ఈ ఏడాదిలో ఇప్పటికి రేగి కాయ సైజులో కాయలు ఉండాల్సి ఉండగా ఇప్పటికీ పూత దశలోనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ప్రతి ఏటా రైల్వేకోడూరులో రూ.100 కోట్ల మామిడి వ్యాపారం జరుగుతుంది. గత ఏడాదిలో 25 శాతం మేరకు పూతలు వచ్చాయి. ఈ ఏడాది అంత వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన అప్పులు తీరుతాయా లేదా అనే సందేహంలో రైతులు ఉన్నారు. గత ఏడాదిలో అరటి వేలాది ఎకరాల్లో వర్షాల దెబ్బకు కుప్పకూలిపోయింది. అపార నష్టాలను రైతులు చవిచూశారు. ఈ ఏడాది మామిడి రైతులు అకాల వర్షాల కారణంగా నష్టాలను చవిచూడాల్సి ఉంటుందేమోనని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు మామిడి పంటకు నేలలో ఎక్కువ శాతం తేమ శాతం పెరుగుతుందని, పూతలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో 25 వేల హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 రకాలకు పైగా మామిడి రకాలను రైతులు పండిస్తున్నారు. బేనీషా, నీలం, తోతాపూరి, పులిహోరా, ఖాదర్, మల్లికా, మాల్గోవా, నూజివీడు రకాలు, ఊరగాయ రకాలు తదితర వాటిని పండిస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షం దెబ్బకు నియోజకవర్గం మొత్తం మీద కోట్లాది రూపాయలు నష్టం జరిగిందని రైతులు తెలిపారు. వర్షాల కారణంగా తేనే మంచు పురుగులు ఆశించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వర్షాలు తగ్గిన తర్వాత శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు సూచించిన మందులను పిచికారీ చేయాలని వారు కోరుతున్నారు.


వర్షానికి ముందు ఉన్న మామిడి పూతలు

ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్నాము..



ప్రతి ఏటా మామిడి పంటలో నష్టాలను చవిచూస్తున్నాము. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. అకాల వర్షాలకు వచ్చిన మామిడి పూతలు దెబ్బతింటున్నాయి. పెట్టిన పెట్టుబడులు వస్తాయా రావా అన్న సందేహంలో మామిడి రైతులు ఉన్నారు. రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట ప్రాంతంలో ముందుగా మామిడి పూతలు వస్తాయి. అయితే ఈ ఏడాది ఆలస్యంగా వచ్చాయి. అకాల వర్షాలు, అధిక మంచు కురవడంతో వచ్చిన పూతలు మాడిపోయాయి. దీంతో మళ్లీ పూతలు వస్తాయన్న నమ్మకం లేదు. రైతులు ఇప్పటికే చాలా ఖర్చు చేసి ఉన్నారు. ఇక ఆ దేవుడే మామిడి రైతులకు దిక్కు.

- నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట, ఆదర్శ మామిడి రైతు

వర్షాలు ఆగిన తర్వాత మందులు పిచికారీ చేయాలి..



మామిడి రైతులు వర్షాలు ఆగిన తర్వాత మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఫ్రూట్స్ సైన్స్ విభాగం ఫ్యాకల్టీ పరిశీలన ప్రకారం చెట్లలో ఉన్న నీటిని బయటకు తీసి వేయాలి. వర్షం తగ్గిన తర్వాత బిల్‌ట్యాక్స్ 3 గ్రాములు లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేయాలి. అదే విధంగా వేప నూనె ఒక లీటరు నీటికి 3 ఎంఎల్ కలుపుకోవాలని, కేఎన్03 3 గ్రాములు లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేయాలి. అధికారుల సూచనలు పాటిస్తే వర్షాల వల్ల మామిడి పంటలకు చీడపీడలు రాకుండా కాపాడుకోవచ్చు.

- కె.స్వరాజ్యలక్ష్మి, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యులు


పెన్నాలో జోరుగా ఇసుక దోపిడీ

- ఎన్నికల వేళ.. వైసీపీ నాయకుల దందా
- అక్రమంగా ఇసుక తరలింపు...అడ్డుకున్న గ్రామస్థులు
- రీచ్‌కు పర్మిషన్ ఉందంటూ బుకాయింపు
- లేదని తేల్చడంతో ఎక్స్‌కవేటర్ వదిలి పలాయనం

జమ్మలమడుగు, జనవరి 8: జమ్మలమడుగులో ఇసుక దందా పెట్రేగి పోతోంది. మండలంలోని దానవులపాడులో, గొరిగెనూరు, పి.సుగు మంచిపల్లె, మోరగుడి, అంబవరం, పొన్నతోట, గూడెం చెరువు, కన్నె లూరు, ముద్దనూరు రోడ్డులోని పెన్నానది వంతెన వద్ద నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అరికట్టాల్సిన రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది పట్టించుకోవడం లేదని విమర్శలు



ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం



62121 Prathima Infrastructure Limited
D.No.54-15-4D, 2nd Floor (Part), Indira Arcade, Srinivasa Nagar, Bank Colony, VIJAYAWADA-520008, A.P.
GSTIN : 37AABCP2098P1ZS
SAND WAY BILL
DMG Work Order No: 2143 Sand P1/23-24, 2143 Sand P3/23-24
Date:
Way Bill No:
Time: AM/PM

1	Name of the Mineral	SAND
2	Delivery Location	
3	Quantity (Metric tons)	
4	Sand Value	
5	Total Amount Paid	
6	Name of the Reach & Stock yars	
7	Vehicle Registration Number	
8	Driver Name	
9	Driver Contact Number	
10	Valid upto	

ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఉన్న బిల్లు బుక్కు

వినబడుతున్నాయి. వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటే స్థానిక పోలీసులకు అడ్డు అదుపు లేకుండా పోయిందని విమర్శలు వినబడు తున్నాయి. ఎన్నికల వేళ అన్ని ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, కార్యక ర్తలు కొందరు కాంట్రాక్టర్లతో ఇసుక దోపిడీకి తెరలేపి.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమ ఇసుక దందా సాగిస్తున్నారు. దానవుల పాడు పెన్నానదిలో ఆదివారం రాత్రి నుంచి ఎక్స్‌కవేటర్లతో ట్రాక్టర్లకు లోడు చేసి ఇసుకను తరలిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం



పెన్నానదిలో ఇసుక తరలించడంతో పెద్ద గోతులు ఏర్పడిన దృశ్యం

సమీప గ్రామ ప్రజలు దానవులపాడు పెన్నానదిలో ఇసుకను తర లించే వారిని అడ్డుకున్నారు. గ్రామానికి నీటి సౌకర్యం బోర్ల వద్ద, రైతుల పంట పొలాల దగ్గర పెన్నానదిలో ఇప్పటికే ఇసుక ఖాళీ చేశా రని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని గ్రామస్థులు చెప్పడంతో.. రీచ్‌కు పర్మిషన్ ఉందంటూ.. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో బిల్లు బుక్కు చూపించి గ్రామస్థులనే దబాయించారు. దీంతో జమ్మలమ డుగు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి ఇసుక తరలింపునకు ఎక్క డైనా అనుమతులు ఉన్నాయా అని అడిగితే.. ఎక్కడా అనుమతులు లేవని తహసీల్దార్ గుర్రప్ప చెప్పడంతో వారిపై ప్రజలు తిరగబడ్డారు. దీంతో పెన్నానదిలో ఇసుక తరలిచేందుకు గుడి సె వేసిన ప్రతిని ధులు ఒక ఎక్స్‌కవేటర్‌ను పెన్నానదిలోనే వదిలేసి.. తాము ఆర్డీవో వద్ద నుంచి కానీ.. జిల్లా అధికారుల వద్ద నుంచి అనుమతి తీసుకుని వస్తామని వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ అధికా రులు, సెబ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసు కాసురులకు ఇష్టారాజ్యంగా మారిందని, అక్కడున్న ప్రజలు ఆరోపించారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాసంవత్సరం నష్టపోకుండా బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 8: విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా బీఈడీ కౌన్సెలింగ్ నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ డిమాం డ్ చేశారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఛాంబరులో వీసీ చింతా సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు



వైస్‌చాన్సలర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ, డీవైఎఫ్‌ఐ నాయకులు

మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ అర్హత పరీక్ష రాసి ఆరు నెలలవుతున్నా ఇంత వరకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించలేదని, ఇదే అదనుగా భావించి ఉమ్మడి కడప జిల్లాలో బీఈడి ప్రైవేటు కళాశలల యాజామాన్యాలు కౌన్సిలింగ్ పూర్తికాకుండానే ఇష్టానుసారంగా మేనేజ్‌మెంటు సీట్లు భర్తీ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి విద్యార్థులు నష్టపోకుండా కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

సౌత్ ఇండియా వాలీబాల్ జట్టుకు కార్తీక్‌రెడ్డి ఎంపిక

సింహాద్రిపురం, జనవరి 8: సౌత్ ఇండియా వాలీబాల్ జట్టుకు సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల సెకండ్ ఇయర్ కంప్యూటర్స్ బ్రాంచ్ విద్యార్థి కార్తీకరెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. అలాగే థర్డ్ ఇయర్ కంప్యూటర్స్ బ్రాంచ్ విద్యార్థి మణికంట ట్రిపుల్ జంప్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ నెల నాల్గవ



సౌత్ ఇండియా టీమ్‌కు ఎంపికైన విద్యార్థులతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

తేదీ నుంచి ఆరవ తేదీ వరకు అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్లో సింహాద్రిపురం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి ఐఏఎస్ హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 1500 మంది పైగా బాల,బాలికలు పాల్గొనడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులు మార్చి నెలలో బెంగుళూరులో జరగబోయే సౌత్ ఇండియా పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించినట్లు ఇన్‌చార్జ్ పీడీసీ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆటోను ఢీ కొన్న లారీ.. ఒకరు మృతి



బసిరెడ్డి మృతదేహం, బసిరెడ్డి (ఫైల్ ఫొటో)

మైదుకూరు, జనవరి 8: ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా.. మరొకరు గాయపడిన సంఘటన సోమవారం సాయంత్రం మైదుకూరు లోని ప్రొద్దుటూరు రోడ్డు బైపాస్ వద్ద జరిగింది. స్థానిక మూలబాటకు చెందిన బండి కుంటమ్మగారి బసిరెడ్డి (58) ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో మైదుకూరు వైపునకు వస్తూ పెట్రోల్ పోయించుకునేందుకు వస్తున్న క్రమంలో ప్రొద్దుటూరు వైపునకు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో బసిరెడ్డి మృతి చెందగా, ఆటోలో ఉన్న గుంత చీపాడుకు చెందిన ఓబన్నకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

సీకేదిన్నె, జనవరి 8: ఈతకు వెళ్లిన మధు (18) అనే యువకుడు మృతి చెందాడు. సీకే దిన్నె ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి వివరాల మేరకు.. కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన బంతి పెద్దయ్య కుమారుడు బంతి మధు ఈనెల 5వ తేదీ తన స్నేహితుడు చరణ్, నరసింహాలుతో కలిసి బుగ్గద్యాంకు ఈతకు వెళుతున్నట్లు ఇంటి వద్ద నుంచి బయలుదేరాడు. అదే రోజు



మధు (ఫైల్ ఫొటో)

రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో అతని స్నేహితులను విచారించగా డ్యాంలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడని. కాపాడే ప్రయత్నం చేయగా వీలు పడలేదని తెలిపారు. దీంతో మరుసటి రోజు మృతుని నానమ్మ ఈశ్వరమ్మ డ్యాం పరిసర ప్రాంతాల్లో పరిశీలించినా ఎటువంటి ఆచూకీ తెలియలేదు. కాగా, డ్యాం గేటు దగ్గర 7వ తేదీ శవం నీటిపైకి తేలగా లష్కర్ నాగేంద్ర సమాచారం మేరకు ఈశ్వరమ్మను పిలిపించారు. మృతుడు తన మనువడని ఆమె గుర్తించడంతో శవాన్ని అప్పగించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

54 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

- వలంటీర్ అరెస్టు



వాలంటీర్ సంజీవరాయుడు




బియ్యం సరఫరా చేస్తున్న వాహనం

ప్రొద్దుటూరు, జనవరి 8: ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగటం లేదు. బియ్యం మాఫియాను అరికట్టడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని దర్గా సందు మున్సిపల్ పార్కు వద్ద రేషన్ బియ్యంను ఐచర్ వాహనంలో తరలిస్తుండగా ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీకి వచ్చిన సమాచారం మేరకు స్పెషల్ టీం నరసయ్య ఆధ్వర్యంలో రేషన్‌బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. ఇందులో 54 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. ఈబియ్యం ఈశ్వరరెడ్డి నగర్‌కు చెందిన వలంటీర్ సంజీవరాయుడు ఆధ్వర్యంలో బయటి ప్రాంతానికి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. కాగా, వలంటీర్ సోములవారిపల్లెకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు కావడంతో ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు సమాచారం. రేషన్‌బియ్యం అక్రమ రవాణాలో వలంటీర్ సంజీవరాయుడుతో పాటు గురుశరత్, మునెయ్య అనే వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌ఐ సాయిప్రసాద్‌కు రేషన్ బియ్యాన్ని పోలీసులకు అప్పగించారు.

మోటర్ బైకు అదుపుతప్పి ఒకరు మృతి

పోరుమామిళ్ల, జనవరి 8: మండలంలోని కొండుగారిపల్లె సమీపంలో మోటార్ బైకు అదుపు తప్పడంతో బాలుడు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. ఎస్.వెంకటరామాపురం గ్రామానికి చెందిన బాలుడు సోమవారం రాత్రి పోరుమామిళ్ల నుంచి ఎస్.వెంకట రామాపు



మృతిచెందిన బాలుడు

రం గ్రామానికి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. విష యం తెలుసుకున్న వెంటనే 108 సిబ్బంది పోరుమామిళ్ల ప్రభుత్వా సుపత్రికి తరలించారు. డాక్టర్లు అప్పటికే అతను మృతి చెందాడని ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కడప(క్రైం), జనవరి 8: కడప నగరం బైపాస్ రోడ్డుపై ఎదురెదురుగా రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నారాయణ వివరాల మేరకు... కడపకు చెందిన ఆనంద్ (42) భార్య, కుమార్తెతో ద్విచక్రవాహనంపై వస్తుండగా వేగంగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ మృతి చెందగా భార్య, కుమార్తె, మరో స్కూటరిస్ట్ గాయపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గొర్రెల పెంపకందారుల సంఘాల బలోపేతానికి చర్యలు

కడప రూరల్, జనవరి 8: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతోందని కేంద్ర సహకారశాఖ తెలంగాణ, ఏపీ స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కడప నగరం ఊటుకూరులోని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘ సమావేశహాలులో సోమవారం సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కువగా నష్టాల్లో ఉన్న సహకార సంఘాలను లాభాల బాటలోకి తీసుకురావడానికి వీలుగా సహకార సంస్థలో సమర్థవంతమైన నాయకత్వాన్ని, నైపుణ్యత కలిగిన సిబ్బందిని ప్రోత్సహించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత పోటీ పూర్వక పరిస్థితుల్లో సంఘం ఆర్థిక స్వాలంబనకు పాలకవర్గం, సిబ్బంది కృషి అనివార్యమన్నారు. సభ్యుల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరుల అంచనాతో క్రమబద్ధమైన వ్యాపార ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. వ్యాపార అభివృద్ధికి, విస్తరణకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కాకపోవడానికి తీసుకున్న రుణాలు తిరిగి



మాట్లాడుతున్న కేంద్ర సహకార శాఖ తెలంగాణ, ఏపీ స్టేట్ కో-ఆర్డినేటర్

చెల్లించకపోవడం ప్రధాన కారణమన్నారు. రికవరీలను పెంచుకోవాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ అన్నెం నాగమల్లేశ్వరయ్య మాట్లాడుతూ ఎన్‌సీడీసీ ద్వారా వచ్చిన రూ. 88 కోట్ల నిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు రాబోతున్నాయని.. ఎన్నికల కోడ్ రాకమునుపే నిధులను మంజూరు చేసి సంఘాల ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, ఆయా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా లక్ష్యాన్ని అధిగమించాలి : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 8: గ్రామీణ స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలను ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రణాళికతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి ఆడుదాం ఆంధ్ర, హౌసింగ్, గడప గడపకు మన ప్రభుత్వం, ఏపీ మీసేవ సర్వీసెస్, ఆధార్ సీడింగ్ తదితర అంశాలపై కడప నగర కమిషనరు ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలసి మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తితో పాటు మనసిక నైపుణ్యాన్ని పెంచేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ క్రీడా పోటీల్లో అన్ని వయసుల వారు పొల్గొన వచ్చన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పోటీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్ లోడు చేయని అధికారులపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధులు కేటాయించిన అధికారులు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు, భద్రతా ఏర్పాట్ల వరకు సిద్ధం చేయాలన్నారు అంతేకాకుండా ఏపీ సర్వేసెస్, ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను సంతృప్తి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్

స్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, హౌసింగ్, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు కృష్ణయ్య, ఆనంద్ నాయక్, యదుభూషణ రెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ బాలాంజనేయులు తదిర అధికారులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు బట్టల పంపిణీ అభినందనీయం

రాయచోటిటౌన్, జనవరి 8: ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. సోమవారం రాయచోటి పట్టణ పరిధిలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయం వద్ద రాయచోటి నియోజకవర్గంలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 260 మంది పేద విద్యార్థులకు అయ్యప్ప సేవాసొసైటీ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డీఈవోతో పాటు జిల్లా అగ్నిమాపకశాఖ అధి కారి అనిల్‌కుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, ఎంఈవో బాలాజీనాయక్‌లు హాజరయ్యారు. అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బట్టలు పంపిణీ చేస్తున్న డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం

నేడు వైవీయూలో పుట్టగొడుగుల సాగుపై వర్క్‌షాపు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 8: కడప వైవీయు బయోటెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో పుట్టగొడుగల సాగుపై ఒకరోజు వర్క్‌షాపు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ విభాగాదిపతి కన్వీనరు ప్రొఫెసరు చంద్రమతి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ హాజరై ప్రారంభిస్తారన్నారు. ఈ వర్క్‌షాపులో పుట్టగొడుగుల పెంపకం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే నిరుద్యోగ మహిళ, యువత తమ పేర్లను నమోదు చేసుకుని వర్క్‌షాపునకు హాజరు కావచ్చని తెలిపారు.

నకిలీ బంగారంతో బురిడీకొట్టించిన గోల్డ్ అప్రైజర్ అరెస్టు

- ఆరుగురి పేర ఫేక్‌గోల్డ్‌లోన్‌తో రూ.3.17 కోట్ల స్వాహా
- అప్రైజర్‌తో పాటు ఆరుగురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, జనవరి 8: స్టేట్ బ్యాంకులో నకిలీ బంగారం పెట్టించి బ్యాంకు అధికారులను మోసం చేసి రూ.3.17 కోట్ల రుణం స్వాహాచేసిన గోల్డ్ అప్రైజర్ పుల్లగూర చంద్రమోహన్‌తో సహా రుణం పొందిన ఆరుగురు ఖాతాదారులను ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రొద్దుటూరు పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ శివాలయం



నిందితుల అరెస్టు చూపుతున్న టూటౌన్ సీఐ ఇబ్రహీం

బ్రాంచ్‌లో జరిగిన ఈ నేరంపై స్టేట్ బాంకు రీజనల్ మేనేజర్ బీఎంవీఎల్ నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు గత ఏడాది నవంబరు 6న కేసు నమోదు చేశారు. ఇందులో స్టేట్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్ పుల్లగూర చంద్రమోహన్‌తో పాటు ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన పప్పు చలపతి, అవ్వారు నాగశ్రీనివాసులు, అచ్యుత గురుస్వామి, కడపకు చెందిన అవ్వారు సుధాకర్, ఖాజీపేటకు చెందిన నల్లమారు నాగేష్, తూగుట్ల వెంకట సుబ్బయ్య ఉన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ ఇబ్రహీం పరారీలో ఉన్న నిందితులను సోమవారం అరెస్టు చేశారు. నిందితులను ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించి జైలుకు పంపారు.

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

రాయచోటిటౌన్, జనవరి 8: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ క్రిష్టారావు ఆదేశాల మేరకు స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 60 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

- తహసీల్దార్‌కు ఆర్డీవో ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రొద్దుటూరు, జనవరి 8: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై వుందని.. బొల్లవరంలోని సర్వేనెంబరు 506లోని ప్రభుత్వ భూమిలో వున్న ఆక్రమణలు సర్వేచేసి మార్కింగ్ ఇవ్వాలని ఆర్డీవో శ్రీనివాసులు తహసీల్దారు నజీర్ అహ్మద్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆర్డీవో తహసీల్దారు నజీర్‌అహ్మద్‌తో చర్చించారు.

జనవరి 2న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన 'కొల్లదుటే కబ్జా' అనే కథనానికి ఆర్డీవో స్పందించారు. ఆ భూమి రికార్డులు పరిశీలించాలని బొల్లవరం సర్వేయర్‌ను పిలిపించి చెప్పారు. ఆర్‌హెచ్, ఈసీ రికార్డులను పరిశీలించి అందులో ప్రవేటు వ్యక్తుల పేర్లు వున్నాయా లేదా పరిశీలించాలన్నారు. లేదంటే ఆభూమిని పూర్తిగా సర్వేచేసి హద్దులను పాతి... అందులో ఏమేమి ఆక్రమిత కట్టడాలు ఉన్నాయో వారి వివరాలతో సహా నివేదిక ఇవ్వాలన్నారు. రెవెన్యూ రికార్డుల మేరకు అది ఏడ బ్యూలాండ్(ప్రభుత్వ) వున్నప్పుడు దాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ భూమి అని రికార్డుల ప్రకారం తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రైల్వేకోడూరు, జనవరి 8: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.రెడ్డప్ప, వ్యవసాయాధికారి బాలగంగాధర్‌లు మాట్లాడుతూ వెంకటసత్యనారాయణ ఏజెన్సీస్ ఎరువుల దుకాణంలో రూ.8,56,300, విలువ చేసే ఎరువులను, విశ్వేశ్వర ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణంలో రూ.1,75,950 విలువ చేసే ఎరువులకు సంబంధించి స్టాకు రిజిస్టరులో అప్‌డేట్ చేయనందున నిలుపుదల చేస్తూ నోటీస్ జారీ చేశామన్నారు. అనుమతి లేనివాని విక్రయించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో రైల్వేకోడూరు వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌తో అప్పులపాలై.. వివాహిత ఆత్మహత్య

పులివెందుల టౌన్, జనవరి 8: ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రెండు లక్షల రూపాయలు అప్పు చేసిన ఓ వివాహిత... భర్తకు తెలిస్తే గొడవలు అవుతాయనే భయంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. వివారల్లోకెళితే... పులివెందులలోని హరిప్రియ గ్యాస్ వీధిలో నివసిస్తున్న షేక్ రేష్మ అనే వివాహిత సోమవారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రొద్దుటూరు పెన్నానగర్‌కు చెందిన రేష్మను దాదాపు నాలుగేళ్ల క్రితం పులివెందులకు చెందిన మహమ్మద్ ఇసాబ్‌కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒకటిన్నర సంవత్సరం పాప ఉంది. ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్న రేష్మ రెండు లక్షల రూపాయలు ఆమె చెల్లెలు షమీన దగ్గర తీసుకుంది. ఈ విషయం భర్తకు తెలుస్తుందన్న భయంతోనే ఉరి వేసుకుంది. ఈ విషయం గురించి సంఘటన స్థలంలో నా బంగారు అమ్మి డబ్బులు కట్టు అని రాసిన లెటర్ లభించిందని పోలీసులు తెలిపారు. లెటర్ ఆధారంగా రేష్మ తల్లి మహబూబ్ జాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యా.. హత్యా!

రేష్మ నిజంగా ఆత్మహత్య చేసుకుందా... లేక హత్యకు గురైందా అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంట్లో ఉండే రేష్మ ఆన్‌లైన్ గేమ్స్‌లో రూ.2లక్షలు పోగొట్టుకొని ఆత్మహత్య చేసుకుందా.. అనే అనుమానం వ్యక్తమవుతోంది. బంగారు అమ్మి రూ.2లక్షలు కట్టమని లెటర్ రాసిందంటే.. అంత సొమ్ము ఉన్నప్పుడు ఆ డబ్బును కట్టే స్థోమత ఉండి కూడా ఉరి వేసుకొని ఉంటుందా అని, కనీసం విషయం తల్లికైనా చెప్పి ఉంటుంది కదా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. హత్యను ఆత్మహత్యగా మార్చడానికి, కేవలం విషయం తప్పుదోవ పట్టించడానికి



రేష్మ మృతదేహం

ఆన్‌లైన్ గేమ్స్ అప్పులని సాకులు పెట్టినట్లు, రాజకీయబలంతో మృతురాలి కుటుంబ సభ్యుల నోరు మూయించి ఉండవచ్చు అని కూడా అనుమానాలు కలుగుతున్నాయి. అది కాకుండా రేష్మ గర్భవతి అని స్థానికులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్







సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్వాడీలు, రైల్వేకోడూరులో.. వర్షంలోనూ నిరసన తెల్పుతున్న అంగన్వాడీలు, ఆయాలు, రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో వంటావార్పుతో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

- తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమైన అంగన్వాడీలు
- కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై పార్లు దండాలతో నిరసన

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 8: జిల్లా కేంద్రం రాయచోటిలోని కలెక్టరేట్ ఎదుట గత మూడు రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల 3 రోజుల రిలే నిరాహార దీక్షలతో పాటు సోమవారం నిరసనలతో మారుమోగింది. సమ్మె 28వ రోజుకు చేరిన సందర్భంగా అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేతనాలు పెంచాలని కదం తొక్కారు. 3వ రోజు దీక్షలకు వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మీదేవి అధ్యక్షతన ప్రారంభమైంది. సోమవారం మదనపల్లె, నిమ్మపల్లెకు చెందిన 15 మంది అంగన్వాడీలు నిరాహార దీక్షలో కూర్చున్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కేవీపీఎస్ జిల్లా కోకన్వీనర్ డీసీ వెంకటయ్య దీక్షలను ప్రారంభించారు. ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, అంగన్వాడీల పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ శవయాత్ర, దిష్టిబొమ్మ దహనం

రాష్ట్రంలో 26 రోజుల సమ్మె తర్వాత అంగన్వాడీలు అత్యవసర సేవలని గుర్తించారా, సమ్మె నోటీసు ఇచ్చినప్పుడే ఎందుకు గుర్తుకు రాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య తెలిపారు. 28వ రోజు ఏపీ అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వం శవయాత్ర పెట్టి దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా తక్షణమే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ, సాంభవి, విశ్వనాథ్‌నాయక్, నాగేశ్వరి, సరోజమ్మ, శ్రీనివాసులు, సుజాత, భారతి, శివరామకృష్ణ దేవర పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంగన్వాడీలపై ప్రభుత్వం చట్ట వ్యతిరేక ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మీ, ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు వనజకుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, కోశాధికారి జి.పద్మావతి, నాయకురాళ్లు వెన్నెల, దుర్గా, శిరీషా, లీలావతి, కుమారి, ఈశ్వరమ్మ, రైతు సంఘం నాయకులు శివవర్మ, న్యాయవాది కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్‌ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి లింగాల యానాదయ్య పాల్గొన్నారు.

వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన

రాయచోటిటౌన్, జనవరి 8: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి శ్రీనివాసులు, సురేశ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు వంటావార్పుతో నిరసన చేపట్టారు. ప్రభుత్వం కార్మిక ఉద్యమాల పట్ల ఆంక్షలు విధించి సమ్మెలు విరమించుకోవాలని బెదిరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బీవీ రమణ, కేశవరావు, లక్ష్మి, హరిప్రసాద్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా మహబూబ్‌బాషా



బాధ్యతలు చేపట్టిన మహబూబ్‌బాషా

రాయచోటిటౌన్, జనవరి 8: జిల్లా కేంద్రమైన రాయచోటి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రథమ సీఐగా షేక్.మహబూబ్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐ గానూ, కడపలో, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) హైదరాబాద్ లోనూ, ఏపీ ఇంటిలిజెన్స్ హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఆయన పనిచేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు.

తులసిరెడ్డికి సన్మానం



తులసిరెడ్డిని సన్మానిస్తున్న రాయచోటి కాంగ్రెస్ పార్టీ నేతలు

రాయచోటిటౌన్, జనవరి 8: పీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాజంపేట పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా నియమించడంతో సోమవారం ఆ పార్టీ కాంగ్రెస్ నేతలు తులసిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ కొత్వాల్ మహమ్మద్‌రఫీ, జిల్లా మీడియా చైర్మన్ నరేశ్, డీసీసీ ఉపాధ్యక్షుడు దర్బార్‌బాషా, పట్టణ మాజీ అధ్యక్షుడు శర్వాణీ ఫారూఖ్‌ఖాన్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్‌అలీఖాన్, డీసీసీ సెక్రటరీ బషీర్ అహ్మద్‌బేగ్‌లు వేంపల్లెలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

పెనగలూరు, జనవరి 8: మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో సోమవారం అయోధ్య రామజన్మభూమి అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య అక్షింతల పంపిణీ కమిటీ సభ్యుడు కె.కళాచంద్ర అధ్యక్షతన శ్రీరామ భక్తులు అక్షింతలతో పాటు అయోధ్యలో నిర్మించిన రామాలయం ఫొటోలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట పిచ్చయ్య, పలుకూరు సుబ్బరామయ్య, టి.రామనాథం, పి.ధర్మయ్యవాసు, డి.హరి, ఉప్పు సిద్ధ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

రామాపురం, జనవరి 8: మండలంలోని బండపల్లె పంచాయతీ ప్రేమాలయం ఆశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం మనవడు ప్రసన్నకుమార్, సుష్మా దంపతుల కుమారుడు హేమన్స్ కుమార్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

సంబేపల్లె, జనవరి 8: నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం జగనన్న కాలనీ లేఅవుట్ సమీపంలో వెలిసిన తిరుమలరాయి గుట్ట దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కడప డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, బీసీ సెల్ నాగరాజుయాదవ్, వసంత శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీ రెడ్డెన్న, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

కాలువ పనులు ప్రారంభం

గాలివీడు, జనవరి 8: మండల కేంద్రంలోని పశువుల సంత వద్ద మురుగుకాలువ నిర్మాణానికి వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి భూమిపూజ చేశారు. సోమవారం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి టెంకాయ కొట్టి నిర్మాణపు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా బీజీ సెల్ కార్యదర్శి బండి పరశురాం, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి, నాగభూషణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు ద్రోహి జగన్‌రెడ్డి : రమేశ్‌కుమార్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 8: రైతులకు ఉరివేసి ఇరిగేషన్‌ను బలిచేసిన రైతు ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి వ్యవసాయశాఖను మూసేశారని, హార్టికల్చర్ రైతులు ఒకపక్క రోడ్డున పడ్డారని, ధాన్యం పండించిన రైతులు పూర్తిగా దగాపడ్డారన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనేవారు లేక, డ్రిప్ సబ్సిడీలు లేక ఒకపక్క మద్దతు ధర కూడా ప్రభుత్వం నుంచి రాక అన్నదాతలకు బతుకే లేకుండా చేశారని, రాష్ట్రాన్ని గోదావరిలో జగన్‌రెడ్డి కలిపేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ జడ్పీటీసీ నరసారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, సంబేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు ఎంతో అవసరం: జడ్పీటీసీ

సిద్దవటం, జనవరి 8: క్రీడలు ఆడటం వల్ల శరీర దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని జడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని పార్వతీపురం గ్రామ సమీపంలో ఉన్న ఆటస్థలంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం క్రికెట్ టోర్నమెంటు పోటీలను వారు ప్రారంభించారు.

పుల్లంపేటలో ఆక్రమణలు తొలగింపు

పుల్లంపేట, జనవరి 8: పుల్లంపేటలోని చిట్వేలి రోడ్డులో సోమవారం తహశీల్దారు నరసింహకుమార్ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా టీడీపీ నాయకులు కేసినేని నారాయణనాయుడు ఇంటిని హిటాచీతో ఆక్రమణలను కొంత మేర తొలగించారు. ఆ తరువాత టీడీపీ నాయకుడు కట్టా బాలాజీనాయుడుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు చేరుకొని పండుగ అయిన తరువాత తామే తొలగించుకుంటామని తహశీల్దారుకు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో మిగిలిన భాగాన్ని వదిలేశారు.

యువత భవితను చీకట్లో నెట్టేసిన సీఎం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు, నవంబరు 8: యువత భవితను సీఎం జగన్ చీకట్లోకి నెట్టేశారని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మాట తప్పి మడమ తిప్పడంలో జగన్ విశ్వసనీయత భయట పడిందన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో ప్రధాన బాధితులు యువతను చీకట్లోకి నెట్టేశారని ఆరోపించారు. మద్యపాన నిషేధం అని చెప్పి మహిళల ఓట్లను దండుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్యనాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేకే చౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, ఓబులవారిపల్లె మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రాజు, మాజీ ఉప సర్పంచ్ నార్జాల హేమరాజ్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రమేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పలు దుకాణాల్లో చోరీ

ఒంటిమిట్ట, జనవరి 8: మండల కేంద్రమైన ఒంటిమిట్ట బస్టాండులో పలు చిల్లర దుకాణాల్లో చోరీ చోటు చేసుకుంది. కడప-చెన్నై జాతీయ రహదారికి అనుకొని ఉన్న దుకాణాల్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి దుకాణాల్లోకి చొరబడ్డారు. గతవారం క్రితం ఇదే దుకాణాల్లో చోరీకి పాల్పడటంతో అప్పట్లో పోలీసులు క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించి నిఘా ఏర్పాటు చేశారు. వారం తిరగకముందే మరలా ఇదే దుకాణాల్లో చోరీ చోటు చేసుకోవడం పోలీసులను విస్మయానికి గురి చేసింది. పైపుల దుకాణంలో రూ.10 వేల నగదు చోరీ జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూధన్‌రావు పరిశీలించి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూధన్‌రావు దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేసి దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దీని ద్వారా దొంగలను గుర్తించవచ్చని సూచించారు.

20వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



జాతీయ రహదారిపై సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 8: సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెల 20 నుంచి చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 20వ రోజుకు చేరింది. ఈ రోజు సమ్మె శిబిరం ఎదురుగా మానవహారం నిర్వహించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి వారికి సంఘీభావం తెలియజేశారు.

క్రీడాకారునికి రూ.50 వేల ఆర్థిక సాయం



దేవేంద్రకు ఆర్థిక సాయం అందజేస్తున్న ద్వారకనాథరెడ్డి

రామాపురం,జనవరి8: మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన దేవేంద్ర త్వరలో ఢిల్లీలో జరిగే ప్రపంచ స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌కు ఇండియా తరపున షూటింగ్ బాల్ టీంకు ఎంపికయ్యాడు. స్థానిక నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని కలిసి దేవేంద్ర ఆర్థిక పరిస్థితుల గురించి వివరించగా దేవేంద్రకు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షూటింగ్ ఆల్ టోర్నమెంట్‌లో ప్రపంచకప్‌కు ఇండియా తరపున సెలెక్ట్ అవడం నియోజకవర్గ ప్రజలకు హర్షించదగ్గ విషయమని, ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనపర్చి ఇండియాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం



ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న సాయిలోకేశ్

చిన్నమండెం, జనవరి 8: కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మండల కేంద్రం చిన్నర్సుపల్లె గ్రామ పంచాయతీల్లో జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో సాయిలోకేశ్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మోదీ ఈ పదేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య, ఈవోపీఆర్డీ పవన్ కుమారి, మండల వైద్యాధికారి సునీతారెడ్డి, మండల స్థాయి అధికారులు, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, రాయచోటి బీజేపీ కన్వీనర్ నిర్మల్ కుమార్, సర్పంచులు అమీరాబీ, పుల్లమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలపై అవగాహన



కూరగాయలను విక్రయిస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, జనవరి 8: సేంద్రియ ఎరువులతో పంటల సాగుపై ఉద్యాన కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ కే.గోపాల్ తెలిపారు. సోమవారం మండలంలోని కళాశాల ఆవరణంలో విద్యార్థులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థిని, విద్యార్థులు సాగు చేస్తున్నారన్నారు. సేంద్రియ ఎరువులతో పాటు పురుగులు, తెగుళ్ల నివారణకు జీవామృతం, బీగాంమృతం, పంచగవ్య, నీమాస్త్రం, అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారి చేసి వాటిని విద్యార్థుల చేత పంటలకు పిచికారి చేయిస్తున్నామని తెలిపారు. ఆచార్యులు యువరాజ్, అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలిత, డాక్టర్ సిద్దేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దినేశ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

పెనగలూరు, జనవరి 8: మండల పరిధిలోని జడావారిపల్లె గ్రామంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఓబిలి చెరువు మాజీ నీటి సంఘం అధ్యక్షుడు జగ్గయ్యగారి శ్రీరాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతిని ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజుతో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఓబిలి మాజీ సర్పంచ్ ఎస్.హబీబుల్లా, గ్రామ పెద్దలు చిన్నయ్య, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి: ఎంపీపీ

ఓబులవారిపల్లె, జనవరి 8: అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీపీ చీర్ల నాగమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీడీవో విజయ్‌రావుల అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా అభివృద్ధి పనులకు ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, ఆయా శాఖల ప్రగతిని తెలియజేశారు. పంచాయతీ రాజ్, పశువైద్యశాఖ, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ పలు శాఖలకు సంబంధించిన అధికారులు అందులో ఉన్న పథకాలు, అర్హులైన వారి గురించి వివరించారు. అనంతరం తహశీల్దారు పుల్లారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీనరసయ్య, వెలుగు ఏపీఎం ఆర్ముగం, పశువైద్యశాఖ అధికారి దుర్గా, ఉపాధి హామీ పథకం ఏపీవో ఆదెప్పరెడ్డిలు మాట్లాడారు. వైస్ ఎంపీపీ గౌరీశంకర్, కొమ్మూరు సుమిత్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వివిధ రకాల వేషధారణలతో చిన్నారులు

రైల్వేకోడూరు, జనవరి 8: పట్టణంలోని సిల్వర్‌బెల్స్ స్కూలులో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు జరుపుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టత ను గురించి విద్యార్థిని, విద్యార్థులకు స్కూలు కరస్పాండెంట్ ఎంవీ కుమార్, హెడ్మాస్టర్ లక్కాకుల రాహుల్ వివరించారు. పిల్లలు వివిధ రకాల వేషాలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు హెడ్‌మిస్ట్రెస్ ఎం.విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, జనవరి 8: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోండి

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 8: జిల్లాలో వలసల నివారణ చర్యలు తీసుకొని ఉపాధి హామీ పనులను తక్షణమే అన్ని గ్రామాల్లో మొదలు పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు జేసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హజ్మాబీ, చలంపాటి నరసింహులు, శంకరయ్య, కుమార్, చంద్రమ్మ, నాగరాజు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ ప్రభుత్వంలో సర్పంచులకు సర్వహక్కులు'

లక్కిరెడ్డిపల్లె, జనవరి 8: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సర్పంచులకు సర్వహక్కులు కల్పిస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు 'కదిలిరా తెలుగుదేశం' సభలో ప్రకటించారని ఉమ్మడి కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సర్పంచుల నేతృత్వంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలతో పాటు పూర్తి స్థాయిలో సర్పంచులకు హక్కులు కలిపిస్తున్నట్లు అధినేత తెలిపారన్నారు. అంతేకాకుండా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలకు గౌరవవేతనం ఇస్తారని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కోనంపేట ఉపసర్పంచు రజాక్, రమణయాదవ్, నాగిరెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

గాలివీడు: టీడీపీ అధికారంలోకి రావడంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఏపీ పంచాయతీరాజ్ సంఘం కార్యవర్గ కార్యదర్శి పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. ఆయన గాలివీడులో మాట్లాడుతూ ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు ఎలాంటి అధికారాలను లేకుండా చేసిందని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను కూడా ఈ ప్రభుత్వం లాక్కున్నదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పంచాయతీల అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తామని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లిస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. పార్టీలకతీతంగా టీడీపీకి సర్పంచులందరూ మద్దతు పలకాలని ఆయన కోరారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా అశోక్‌కుమార్

నందలూరు, జనవరి 8: ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా అల్లం అశోక్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం, అన్నమయ్య జిల్లా 77వ వార్షిక సమావేశాలను ఆదివారం ఉదయం మదనపల్లెలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన నూతన జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా అశోక్‌కుమార్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోహన్‌రాజు, డివిజనల్ కో-కన్వీనర్‌గా వై.మహేశ్వరబాబు, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా ఎం.వి.రమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నందలూరు ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎండీ షఫీఉల్లా, పి.లీలాకృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి మార్కండేయులు హర్షం వ్యక్తం చేశారు.

రోళ్లమడుగులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

రాజంపేట, జనవరి 8: రాజంపేట మండలంలోని రోళ్లమడుగు గ్రామంలో రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రోళ్లమడుగు గ్రామ కమిటీ అధ్యక్షుడు ముప్పవరం కృష్ణయ్యనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను వారికి అందజేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి జరిగే మేలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమని, సీఎం జగన్ నియంతృత్వ విధానాల వల్ల రాష్ట్రం అధోగతి పాలైందన్నారు.

ఆక్రమణపై తహశీల్దారుకు ఫిర్యాదు

పుల్లంపేట, జనవరి 8: మండల పరిధిలోని కొమానుపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించడంపై కుమారునిపల్లె గ్రామస్తులు సోమవారం తహశీల్దారు నరసింహకుమార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 810, 811. 812లో 71 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. ఈ భూమిలో పెద్దల కాలంలో కొండయ్యతాత జీవ సమాధి కావడంతో ఈ ప్రాంతాన్ని తాము పూజించుకుంటూ వచ్చామని, ప్రస్తుతం ఈ భూమి ఆక్రమణకు గురైందని, దీనిలో ఆలయ నిర్మాణానికి, రహదారికి స్థలం కేటాయించి ఆక్రమణలు తొలగించాలని అందులో పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసనాగ్రహం

'స్పందన'లో భాగంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద తెలుగు యువత నేతలు, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసనాగ్రహం ప్రకటించారు. ఓ పక్క వర్షం కురుస్తున్నప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు.

- చిత్తూరు


నిరసన తెలుపుతున్న తెలుగు యువత నేతలు


నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


వర్షంలోనూ సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళన

జాబ్ క్యాలెండర్ ఏదీ?

వేలాది మంది యువత ఆత్మహత్యలకు సీఎం నిర్లక్ష్యమే కారణమని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ ఆరోపించారు. నాలుగున్నరేళ్లయినా జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంపై జనసేన, తెలుగు యువత నేతలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలు లేకపోవడంతో యువత ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రాజేష్ ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఒక్కటి కూడా విడుదల చేయలేదన్నారు. టీడీపీ హయాంలో డీఎస్సీ ద్వారా రెండు విడతల్లో 18 వేల ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. నిరుద్యోగం కారణంగా యువత వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనపార్టీ నేత యశ్వంత్, తెలుగు యువత నేతలు భరత్, చంద్రబాబురెడ్డి, హేమాద్రి, మంజు, దిలీప్, గుణ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తాం

హామీలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు షకీల, ప్రేమ, ప్రభావతి, సుజని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో వీరు మాట్లాడారు. అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించినా భయపడేదే లేదని స్పష్టం చేశారు. వర్షంకురుస్తున్నా లెక్కచేయక నిరసనలతో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. అంగన్వాడీలకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ సంఘీభావం ప్రకటించారు. భోజనాలను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు వరలక్ష్మి, జాఫర్, నంద, అత్తు, సర్దార్, జిలాని, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ సమ్మె

సమగ్రశిక్ష ఉద్యోగులు వర్షంలో కూడా సోమవారం సమ్మెను కొనసాగించారు. విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం సరికాదని ఉద్యోగ సంఘ నేతలు వాపోయారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు ఆందోళనలను విరమించబోమని ప్రకటించారు.

కొంగాటంలో బంగారు ఆభరణాల చోరీ


ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

వి.కోట, జనవరి 8: వి.కోట మండలం కొంగాటంలోని సుబ్రమణ్యం ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అయన చిన్న కుమారుడు సోమవారం మధ్యాహ్నం కుప్పం కాలేజి నుంచి ఇంటికి చేరుకున్న ఆయన చిన్న కుమారుడు విశ్వనాథ్ ఇంటి తలుపులు తెరచిఉండడంతో వెళ్లి చూడగా లోపల బంగారు ఆహరణాల పెట్టెలు చిందరవందరగా పడిఉన్నాయి. దీంతో అతను కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా వ్యవసాయ పనులకు వెళ్ళిన వారు ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు గుర్తించారు. తక్షణం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ లింగప్ప సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీపై విచారణ చేపట్టారు. ఏడాది క్రితం సుబ్రహణ్యం పెద్ద కుమారుడు లోకేష్‌కు వివాహం జరిగింది. అతడికి చెందిన ఆభరణాలు ఇంట్లో ఉంచి, వారు బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉంటుండగా, గ్రామంలో సుబ్రమణ్యం, అతడి భార్య రత్నమ్మ, చిన్నకుమారుడు ఉంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్ళేప్పుడు ఇంటికి తాళం వేసి ఓ చోట ఉంచి వెళ్ళే వారమని, సోమవారం యథాప్రకారం వెళ్ళగా, ఎవరో కనిపెట్టి దాచి ఉంచిన తాళం తీసి చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నుంచి క్లూస్ టీం ఈ గ్రామానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. పల్లెకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి వెళ్ళారా..? లేక ఇక్కడి వారే చోరీకి పాల్పడ్డారా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఆలయాల సమాచారంతో కొత్త వెబ్‌సైట్

తిరుపతి (కల్చరల్), జనవరి 8: తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ అనుబంధ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కొత్త వెబ్‌సైట్ (ttdevasthanams.ap.gov.in)ను టీటీడీ సోమవారం ప్రారంభించింది. మహతి వేదికగా టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో 60 ఆలయాలకు సంబంధించి స్థల పురాణం, దర్శనం, పూజాదికాల వేళలు, రవాణా, వసతి, ఆర్జిత సేవల వివరాలు పొందుపరిచామని భూమన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈనెల 6, 7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సులో ఆయన్ను ఎన్నుకున్నారు. ఎస్వీయూనివర్సిటీ ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి, పురావస్తు విభాగంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుమల మ్యూజియం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై 16 పుస్తకాలు, 95 పరిశోధనా వ్యాసాలు రాశారు. 72 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ప్రత్యేకించి శాసనాల వెనుక దాగున్న చరిత్రను వెలికితీశారు. ఇదివరకే ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రొసీడింగ్స్‌కు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఓఆర్ఐ పరిశోధకుడు నరేష్ మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఎస్వీ యూనివర్సిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) పరిశోధకుడు డాక్టర్ వెలిగారం నరేష్ (43) మృతి చెందారు. చిత్తూరు సమీపంలో గల బ్రాహ్మణపల్లెకు చెందిన ఆయన తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ఆచార్య చిట్రాజు గోవిందరాజుల పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొంతకాలంగా కామెర్లతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు. నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,058 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,543 మంది తలనీలాలు సమర్పించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సికింద్రాబాదు-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్ల (07055-07072-02707) నడపనున్నట్లు సీపీఆర్ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రైళ్లు ఈ నెల 10, 14, 15 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తిరుమలలో హీరో సుధీర్ బాబు



తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం సినీ హీరో సుధీర్‌బాబు సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని కావేరి విశ్రాంతి భవనానికి చేరుకున్న ఆయనకు స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

తిరుపతి (విద్య), జనవరి 8: తిరుపతిలోని తైక్వాండో అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో కార్యవర్గ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా టి.ధనంజయులు, వైస్ ప్రెసిడెంట్లుగా డి.క్రాంతికుమార్, కె.వెంకటరమణాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.మనోహరనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా సి.రామనన్, సి.శంకర్, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఈసీ సభ్యులుగా బీఎస్ అరుణ్, ఎం.సంతోష్, వి.కిరణ్, ఎ.కోదండం, సీఆర్ హర్షితను ఎన్నుకున్నారు. కాగా సంఘ ఆధ్వర్యంలో ఈనెల 17న చిత్తూరులో సబ్ జూనియర్ తైక్వాండో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించాలని తీర్మానించామని ప్రకటించారు.

'స్పందన'కు 369 అర్జీలు


కలెక్టరేట్‌లో అర్జీలు ఇవ్వడానికి బారులు తీరిన జనం

చిత్తూరు, జనవరి 8: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 329 మంది అర్జీదారులు హాజరై జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌కు సమస్యలను విన్నవించారు. అర్జీలు అందజేశారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఓ పక్క వర్షం కురుస్తున్నప్పటికీ అర్జీదారులు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. బాధితుల సమస్యలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు 269, డీఎస్వోకు 17, నేషనల్ హైవేకు 6, ఉపాధి శాఖకు 5, పోలీసు శాఖకు 5 వంతున, మిగిలిన శాఖలకు 23 అర్జీలు అందాయి. కాగా, వెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామలెక్క దాఖలాలో కళ్లాం భూమిని భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆ గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ నుంచి డిప్యూటీ సీఎం నారాయణస్వామి వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అగ్రకులస్తులు కళ్లాం భూమిని ఆక్రమించుకుని కంచె వేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


బాధితులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఏఎస్పీలు

పోలీసు స్పందనకు 25 వినతులు

చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నలుమూలల నుంచి 25 మంది అర్జీదారులు హాజరయ్యారు. బాధితుల నుంచి ఏఎస్పీ సుధాకర్, సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో భూతగాదాలు 11, డబ్బు తగాదాలు 4, దారి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 2, ఇంటి తగాదాలు ఒకటి చొప్పున ఉన్నాయి.

ఒకటే జడివాన


వర్షంలో కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులు


చిత్తూరులో..

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. విడవని జడివానతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆకాశమంతా మేఘావృతం కావడంతో పాటు చల్లటి గాలులు వీస్తుండటంతో వృద్ధులు బయటకు రావడానికి భయపడే పరిస్థితి నెలకొంది. చిత్తూరులో ఆదివారం రాత్రి 10.30 గంటల నుంచి సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దాంతో ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారాలు జరగక చిరువ్యాపారులు దెబ్బతిన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 22 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా గుడిపాలలో 14.0, పాలసముద్రంలో 12.2, యాదమరిలో 10.0, శ్రీరంగరాజపురంలో 9.0, నిండ్రలో 7.2, చిత్తూరులో 6.2, బైరెడ్డిపల్లిలో 5.6, నగరిలో 4.6, శాంతిపురంలో 4.6, తవణంపల్లిలో 4.4, విజయపురంలో 3.6, సదుంలో 3.4, కార్వేటినగరంలో 2.4, బంగారుపాళ్యంలో 2.2, పులిచెర్లలో 2.0, గంగాధరనెల్లూరులో 2.0, వి.కోటలో 1.4, పూతలపట్టులో 1.0, గంగవరంలో 1.0, పలమనేరులో 1.0, సోమలలో 1.0, పుంగనూరులో 0.6, పెద్దపంజాణిలో 0.6, పెనుమూరులో 0.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. జనవరి నెల సరాసరి వర్షపాతం 4.9 మి.మీ కాగా, సోమవారం నాటికి 3.2 మిమీ వర్షం పడింది.

ముగ్గురు వైసీపీ నేతలపై క్రిమినల్ కేసు

నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు -వీరిలో ఇద్దరు కార్పొరేటర్లు... మరొకరు మహిళా నేత

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరుపతికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదయ్యారు. వీరి సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో క్రిమినల్ కేసు నమోదైంది.గతేడాది మార్చిలో రాయలసీమ తూర్పు నియోజకవర్గ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ కార్పొరేటర్ మునిరామిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు, కొర్లగుంటకు చెందిన వైసీపీ నాయకురాలు విజయ ఓటర్లుగా నమోదయ్యారు. అయితే వీరు పట్టభద్రులు కాదని అప్పట్లో టీడీపీ పరిశీలకులుగా వ్యవహరించిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వీరిపై తిరుపతిలో రెవిన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఓటర్లుగా నమోదయ్యేందుకు ముగ్గురు వైసీపీ నాయకులు సమర్పించిన సర్టిఫికెట్లు నిజమైనవేనా అని విచారణ నిర్వహించగా అవన్నీ ఫేక్ సర్టిఫికెట్లని తేలింది. దీంతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకులు వనజ, మునిరామిరెడ్డి, ఎస్కే బాబులపై క్రైమ్ నంబరు 157-2023 పేరిట క్రిమినల్ కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్ 171 డి, అలాగే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 కింద ఈ కేసు నమోదైంది. అయితే జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయాన్ని గోప్యంగా వుంచింది. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణల్లో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ కార్యాలయం నుంచీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వివరిస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి టీడీపీ కార్యాలయానికి సోమవారం పంపిన లేఖలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతో సుమారు ఆరు నెలలు ఆలస్యంగా వైసీపీ నేతలపై కేసు నమోదైన సంగతి వెలుగు చూసింది. బాధ్యత కలిగిన డివిజన్ కార్పొరేటర్లుగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తూ తప్పుడు విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించి పట్టభద్రులమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నడకమార్గాల్లో భక్తుల రక్షణకు చర్యలు

నిర్భయంగా నడిచిరావచ్చు: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్భయంగా శ్రీవారి దర్శనానికి నడిచి రావచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్), ఏపీ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక సమర్పించిందన్నారు. టీటీడీ, ప్రభుత్వ అటవీశాఖ ఇప్పటివరకు తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై చర్చించారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావాల్సిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యూలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్(పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్ పాస్, ఓవర్ పాస్‌ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. కెమెరాట్రాప్‌లు, మానిటరింగ్ సెల్, వ్యూలైన్ల ఏర్పాటు, అవుట్‌పోస్టుల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని, ఏడవ మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానటరింగ్ సెల్ కోసం భవనాన్ని సమకూర్చాలని సీఈని కోరారు. నడక మార్గాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఎసీఏవో బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో శ్రీనివాస్, తిరుపతి డీఎఫ్‌వో సతీష్ పాల్గొన్నారు.

ఈ భూమి మాదే.. కాదు మాదే..!

- అటు రెవెన్యూ.. ఇటు అటవీ శాఖల వాదన
- మధ్యలో నలిగిపోతున్న పట్టాలు పొందిన రైతులు

కేవీబీపురం, జనవరి8: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలో ఆదవరం రెవిన్యూలో ఉన్న సర్వే నంబర్లు 194ఏ, 194బీలో ఉన్న సుమారు 4.87 ఎకారల భూమి పక్కా సెటిల్‌మెంట్ నేల. ఈ భూమిని రైతులకు రెవెన్యూ వారు పట్టాలిచ్చారు. ఇటీవల అటవీ శాఖ వారు ఆ నేలలో ప్రవేశించ వద్దని అది రిజర్వుడు ఫారెస్టుకు చెందినదని రైతులపైన ఒత్తిడి తెచ్చారు. దీంతో రైతులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఈ వివాదంపై శ్రీకాళహస్తి ఎఫ్ ఆర్‌వో లోకేష్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ శ్రీదేవిని కలిశారు. ఆ నేల తమదేనంటూ వాదించారు. దీంతో తహసీల్దార్ రికార్డులను పరిశీలించారు. 1952, 1957లో ఆ నేల సుమారుగా 250 ఎకరాల వరకు రెవిన్యూకు చెందినదిగానే ఉంది. ఆ నేలకు అప్పట్లో రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ నేల సెటిల్‌మెంట్‌గా చెలమణిలో ఉందని గుర్తిం చారు. అటవీ అధికారులు మాత్ర అందుకు అంగీకరించలేదు. చివరగా ఉమ్మడి జిల్లాలోని రికార్డులను సైతం పరిశీలించాక చర్చిద్దామని అటవీ అధికారులకు తహసీల్దార్ తెలియజేశారు. అంతవరకు రైతులపై చర్యలు తీసుకోరాదని సూచించారు. అటు అటవీ ఇటు రెవిన్యూ మధ్యలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయంచేయాలని రైతులు కోరుతున్నారు.

హైదరాబాదుకు మరో స్టార్‌లైనర్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 8 : హైదరాబాదుకు జిల్లా నుంచి మరో స్టార్‌లైనర్(నాన్ ఏసీ స్లీపర్) సర్వీసు అందుబాటులోకి వచ్చినట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే తిరుపతి నుంచి ఓ సర్వీసు నడుస్తుండగా ప్రయాణికుల కోరిక మేరకు వెంకటగిరి నుంచి రెండు రోజుల క్రితం అందుబాటులోకి వచ్చింది. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి రోజు రాత్రి 7.30గంటలకు బయల్దేరుతుంది. గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, మిర్యాలగూడ మీదుగా హైదరాబాదు, బీహెచ్‌ఈఎల్‌కు మరుసటి రోజు ఉదయం 8గంటలకు చేరుకుంటుంది. అలాగే బీహెచ్ఈఎల్ నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వెంకటగిరికి చేరుకుంటుంది. ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

కథలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, జనవరి 8: కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు వర్థమాన రచయితల నుంచి కథల సంపుటిలు, నవలలు, చందోబద్ధ, వచన కవితలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కారాల ప్రదాతలు డాక్టర్ కె.రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రచయితలు, కవులు మాత్రమే తమ రచనలను ఈనెల 31వ తేదీలోపు 'డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు-517001' చిరునామాకు పంపాలని కోరారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి సందర్భంగా చిత్తూరులో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

12లోగా ఓటరు క్లెయిమ్‌లను పరిష్కరించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: 'ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈనెల 22న ఓటరు తుది జాబితా ప్రచురణ జరగనుంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు అందిన క్లెయిమ్‌లను ఈనెల 12వ లోగా పరిష్కరించాలి' అని జేసీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి మునిసిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతనెల 9వ తేది నాటికి అందిన వివిధ క్లెయిమ్‌లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే పరిశీలించాలన్నారు. ఈనెల 11న చిత్తూరులో జరిగే జిల్లాస్థాయి సమావేశానికి ఎన్నికల అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు చిన్నయ్య (చిత్తూరు), సృజన (నగరి), మనోజ్‌కుమార్ రెడ్డి (పలమనేరు), శ్రీనివాసులు (కుప్పం), ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడి.. పంటల ధ్వంసం



కల్లూరు, జనవరి 8: పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడులు చేయడంతో మామిడి, టమోటా పంటలకు అపారనష్టం వాటిల్లింది. మిట్టమీదరాచపల్లెలోని రైతు రమణమ్మ పొలంలోని టమోటా పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు 20 మామిడిచెట్లను, బోరు పైపులు, డ్రిప్ పైపులను విరిచేశాయి. దేశిరెడ్డిగారిపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి మామిడితోటలోని 8 గేట్‌వాల్వ్‌లు, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి(లీగల్), జనవరి 8 : ఓ వ్యక్తిని హతమార్చిన తమిళనాడు వేలూరుకు చెందిన బాలకృష్ణభాస్కర్‌కు జీవితఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. 2022 జూలై 21న తమిళనాడుకు చెందిన కందస్వామిశ్రావణ్‌తో బాలకృష్ణ భాస్కర్ గొడవపడ్డారు. ఈ క్రమంలో తిరుమల కాలినడక షెడ్డులో నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో తలపై మోది కందస్వామి శ్రావణ్‌ను బాలకృష్ణ భాస్కర్ చంపేశాడు. నిందితుడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో ఈ మేరకు శిక్ష విధించారు.

చేతకాని సీఎం గద్దె దిగాలి..

● వర్షంలో అంగన్వాడీ కార్యకర్తల నిరసన

వాల్మీకిపురం, జనవరి 8: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడం చేతకాని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గద్దె దిగిపోవాలని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రహదారిపై వర్షంలో గొడుగులు పట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబరు 2ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయకపోతే అంగన్వాడీల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. తమపై ప్రభుత్వం బెదిరింపు చర్యలను ఇకపై సహించబోమన్నారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే అంగన్వాడీల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, దేవసేన, లక్ష్మీప్రసన్న, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు. సమ్మెకు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు మద్దతు తెలిపారు. కార్యకర్తలతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుబు వెంకటరమణ, రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రాచారి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, కోసూరి చంద్రమౌళి, దిలీప్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు శ్రీవాణి, చాంద్‌బీ, కుమారి, బి.కొత్తకోట, మొలకలచెరువు, పీటీఎం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: విధుల్లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ పెట్టినా అంగన్వాడీలు పట్టించుకోకుండా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రామసముద్రం మండలానికి చెందిన అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. సీఐటీయూ నాయకురాళ్లు, మదనపల్లె, నిమ్మనపల్లె అంగన్వాడీలు రాయచోటిలో నిర్వహించిన నిరాహారదీక్షకు వెళ్లగా రామసముద్రం మండలానికి చెందిన అంగన్వాడీలు మదనపల్లెకు వచ్చి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు అనసూయ, భాగ్యమ్మ, రాధ, లక్ష్మి, సుజ్ఞాన తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: అంగన్వాడీలపై ఎస్మా జీవోను వెంటనే వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, సహాయకురాళ్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో చేస్తున్న నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నా అంగన్వాడీలు లెక్కచేయకుండా గొడుగులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాస్తారోకో

బి.కొత్తకోట: అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో బి.కొత్తకోటలో సోమవారం రాస్తారోకో చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మాట్లాడుతూ 28 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించక పోగా బెదిరింపులకు దిగడం జగన్ ప్రభుత్వానికి తగదన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు అంగన్వాడీ కార్యకర్తలు సిద్దంగా ఉన్నారన్నారు. జీవోనెంబర్ 2 ప్రతులను చేతబట్టుకుని ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వాటిని జ్యోతి బస్టాండు కూడలిలో తగులబెట్టారు. కార్యక్రమంలో వీరప్ప, రెడ్డెప్ప,అంజి, రమణ, గణేష్, గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



బి.కొత్తకోట: అంగన్వాడీ సమ్మెకు మద్దతుగా రాస్తారోకో చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

దిక్కుతోచని స్థితిలో వైసీపీ: నల్లారి



భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జనవరి 8: భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ప్రకటించిన ఆరు పథకాలతో దిక్కుతోచని వైసీపీ ప్రభుత్వం వాటిని కాపీ కొట్టి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. సోమ వారం మర్రికుంటపల్లె పంచాయతీ లోని పాత దళితవాడలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు అయ్యే విధంగా సంక్షేమ పథకాలు అమలవు తాయని తెలియ చేశారు. ఈ నెల 24న పీలేరులో జరుగనున్న చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, సర్పంచులు ప్రతాప్‌కుమార్ రెడ్డి, రెడ్డిరాము, మాజీ సర్పంచు సతీష్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, సురేష్‌కుమార్ రెడ్డి, జనార్దన, పూర్ణచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాలతి, అనుబంధ విభాగాల నాయకులు శ్రీనివాసులు, అగస్తి, మోహన, తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌ను కలిసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు

కురబలకోట, జనవరి 8: టీడీపీ జాతీ య కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డిని సో మవారం కలికిరిలో తంబళ్లపల్లె నియో జకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు కలిశారు. ఆయనను సన్మానిం చారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి నియోజక వర్గంలో నెలకొన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లా రు. నియోజకవర్గంలో అధికార నేతలు అల్లర్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివరాంరెడ్డి, గోపాల కృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కులగణన ప్రారంభం

కలికిరి, జనవరి 8: ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన సర్వే ప్రారంభమవుతుందని ఎంపీడీవో గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకే వలంటీర్ల ద్వారా కులగణన సర్వే జరుగుతుందని ఆయన తెలిపారు. వలంటీర్ల స్థానాలు ఖాళీగా వున్న చోట్ల ఇతర వలంటీర్లను ఇన్‌చార్జీలుగా నియమించి సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ లోగా అసంపూర్తిగా వున్న శిక్షణ కార్యక్రమాలన్నీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సర్వే చేయాల్సిన విధానాలపై ఇప్పటికే వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలను అందజేశామని వివరించారు. వలంటీర్లను, సచివాలయ సిబ్బందితో అనుసంధానించే విధంగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామని గంగయ్య విశదీకరించారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి అభినందన

పీలేరు, జనవరి 8: పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీ విజేత హోత్రిశ్రీని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి ప్రభాకర్ రెడ్డితో మంత్రి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు షామియాన షఫీ, పీలేరు సర్పంచ్ జీనత్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారాతో పట్టుబడ్డ వ్యక్తి

నిమ్మనపల్లి, డిసెంబరు 8: నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బండ్లపై గ్రామంలో చింతచెట్లు కింద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి వెంకటరమణ కుమారుడు దొరబాబు(44)ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

నేడు మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ పర్యటన

పెద్దమండ్యం, జనవరి 8: పెద్దమండ్యం మండలం లో మంగళవారం తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ పర్యటిస్తారని ఆ నియోజకవర్గం బీసీ నాయకుడు బిక్కా మధుకర వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమండ్యంలో మండల టీడీపీ కార్యకర్తలతో సమావేశం జరుగునున్నట్లు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

10 నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



పీడీ, పీఈటీలతో సమీక్షిస్తున్న ఎంపీడీవో సురేంద్రనాథ్

తంబళ్లపల్లె, జనవరి 8: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతం చేయాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి క్రీడల నిర్వహణపై పీడీ, పీఈటీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ...సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 10 నుంచి 20 వరకు మండల స్థాయిలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడి మొఘల్ ఖాదర్‌బాష, పీఈటీలు దేశ్‌ముఖ్, చలపతిరెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

మదనపల్లె, జనవరి 8:టీడీపీ అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్మికుల ముందు ధర్నా చేస్తున్న కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు. మూడునెలల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రానుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సీఎం కావడం ఖాయమన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు అధినేత దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, కర్షక, కార్మికులు ఎవరూ సంతోషంగా లేరన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించేది లేదని యూనియన్ నాయకులు తెగేసి చెబుతున్నారు. సోమవారం వర్షం కురుస్తున్నా.. కార్మికులు సీఎం జగన్‌కు, స్థానిక ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సమ్మెలో యూనియన్ నాయకులు ఎస్.మస్తాన్, సురేష్‌కుమార్, ఇంద్రాణి, దేవ, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం: పఠాన్ ఖాదర్‌ఖాన్

పారిశుధ్య కార్మికులకు టీడీపీ అండగా ఉంటుందని పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచి పఠాన్ ఖాదర్‌ఖాన్ భరోసా ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మిక, కర్షక వర్గాలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీని ఆదరించి, చంద్రబాబునాయుడు సీఎం కావడానికి సహకరించాలని ఆయన కార్మికులను కోరారు. ఈసందర్భంగా కొందరు కార్మికులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.



కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

భూ సర్వే ఆలస్యం చేసే వారిపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, జనవరి 8: భూ సర్వేలు ఆలస్యం చేస్తున్న సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మురళి ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో మురళి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తమ భూమి కన్వర్షన్ చేయాలని, చలానా కట్టి ఐదు నెలలు అవుతున్నా అధికారులు స్పందించలేదని డాక్టర్ చంద్రమోహన్, శంకర నారాయణరెడ్డి ఆర్డీవోకు అర్జీ అందజేశారు. దీనిపై నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ కృష్ణమూర్తిని ఆర్డీవో ఆదేశించారు. వాల్మీకిపురం మండలం మంచూరు పంచాయతీలో అక్రమ కొళాయి కనెక్షన్లను తొలగించాలని చంద్రయ్య ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లెలో గ్రామకంఠం భూమిని కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్థుడు వెంకటరమణ ఫిర్యాదు చేయగా, దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని రామసముద్రం ఈవోపీఆర్‌డీని ఆర్డీవో ఆదేశించారు. వీటితో పాటు ఎక్కువ భూ వివాదాలు, పాసుపుస్తకాలు మంజూరు, పింఛన్ల మంజూరు చేయాలని ప్రజలు ఆర్డీవోకు వినతులు అందజేశారు.



ఆర్డీవో మురళికి వినతిపత్రాలు సమర్పిస్తున్న అర్జీదారులు

ఎంఈవో కార్యాలయ సిబ్బందికి ఆర్థిక సాయం

పెద్దతిప్పసముద్రం జనవరి 8: మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న కార్యాలయ సిబ్బంది ఎంఐఎస్, సీఆర్పీ, మెసెంజర్స్, డీఎఫ్‌వో సిబ్బంది గత నెల 20 నుంచి తమ న్యాయపరమైన హక్కుల సాధన కోసం సమ్మె చేస్తున్నారు. వారికి సంఘీబావం తెలియ చేస్తూ, మండలంలోని యూటీఎఫ్, ఎస్టీయూ ప్రతినిధులు ఎంఈవోలు, ఉపాధ్యాయులు రూ. 97 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నారాయణ, గౌస్‌పీర్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కేంద్రం దృష్టికి సహకార ఉద్యోగుల సమస్యలు

నిమ్మనపల్లి, జనవరి 8: న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం కేంద్ర సహకార శాఖామాత్యులు అమిత్‌షా ఆధ్వర్యంలో నిర్వహించిన జన ఔషధి ప్రారంభ కార్యక్రమంలో సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను వివరించినట్లు సహకార ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పప్పు హరినాధరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్, రైల్వే రంగాల మాదిరి సహకార ఉద్యోగులకు సహకారం అందించాలని కోరారు. అలాగే హెచ్ఆర్ పాలసీలపై సహకార సంఘ ఉద్యోగులకు తగు న్యాయం చేయాలని ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం అమిత్‌షా 10వేలకు పైగా జన ఔషధ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.



మాట్లాడుతన్న హరినాథ్‌రెడ్డి

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

పెద్దతిప్పసముద్రం జనవరి 8: అన్నమయ్య జిల్లా ఎస్టీయూ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మదనపల్లెలోని ఎస్ఆర్‌కె కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పీటీఎం మండలానికి చెందిన ఇ.రామకృష్ణ అదనపు ప్రధాన కార్యదర్శి గా, లక్ష్మినారాయణ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అశోక్‌రెడ్డి స్టేట్ కౌన్సిలర్‌గా ఎన్నిక య్యారు.

ములకలచెరువు: ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా ములకలచెరువుకు చెందిన ఎస్.అమరనాథరెడ్డి ఎన్నికయ్యారు.

నిమ్మనపల్లి: జిల్లా ఎస్టీయూ కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి ఎన్నికయ్యారు. కురవపల్లి ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి కార్యదర్శిగా, వెంకోజీగారిపల్లి ఉపాధ్యాయుడు సోమేపల్లి శ్రీనివాసులును ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్నుకొన్నారు.

మదనపల్లె టౌన్: మదనపల్లె పట్టణ అధ్యక్షుడుగా కె.ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా డి.ఖాజావలిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 8: మున్సిపల్ పారిశుధ్యకార్మికుల సమస్యలను పరిష్క రించాలని బీజేపీ మదనపల్లె పట్టణ మాజీ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, రాజం పేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్ సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. మదనపల్లె మున్సిపాలిటీలో పారిశుధ్యకార్మికులు ఆరు రోజులుగా సమ్మె చేస్తుండడంతో పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారిం దన్నారు. వారి సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మధు, డాక్టర్ అజంతుల్లాఖాన్, క్రిష్ణయ్య వర్మ, పూలనాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

పెద్దమండ్యం, జనవరి 8: మండలంలో వికసిత్ భారత్ యాత్ర కొనసాగింది. మండలవారిపల్లి, బండ్రేవు గ్రామాల్లో సోమవారం ప్రజలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, జీఎస్ సిబ్బంది సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో శ్రీధర్ రావు, డీటీ గౌరిశంకర్, ఏవో సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూ ఏఈ హరిప్రసాద్, ఏపీవో మురళి, ఈవోఆర్డీ జనార్ధన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఇద్దరు అరెస్ట్

బి. కొత్తకోట జనవరి 8 : బి.కొత్తకోట మండలంలోని గుడిసివారిపల్లె వద్ద కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు బి.కొత్తకోట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ తెలిపారు. కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం తమ సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేయడంతోపాటు రూ. 6650 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా తగినచర్యలు తీసుకుంటామన్నారు.

నూతన మసీదును సందర్శించిన ఎమ్మెల్యే

బి.కొత్తకోట జనవరి 8 : పట్టణంలోని బైపాస్‌రోడ్డులో నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో నిర్మించిన మసీదును తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సోమవారం సందర్శించారు. సుందరంగా, ఆధునిక, సంప్రదాయ పద్దతిలో రూపుదిద్దుకున్న మస్జీద్ ఏ ఖదీర్‌ను తిలకించి ముస్లిం పెద్దలతో ముచ్చటించారు.

వైభవంగా వీరభద్రుడి పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, జనవరి 8: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య, చంద్రశేఖర్‌స్వామి, నాగేశ్వరయ్యస్వామి, మల్లికార్జునస్వామి, రాజయోగీశ్ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పల్లకిపై ఆసీనులను చేసి మాడవీధుల్లో ఊరేగించారు.

రాష్ట్రంలో చీకటి పాలన: దొమ్మలపాటి

మదనపల్లె టౌన్, జనవరి 8: రాష్ట్రంలో చీకటి పాలన సాగుతోందని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో గిట్టుబాటు ధరలు రాక, అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చంద్రబాబు సీఎం అవుతూనే రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తారని, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అమలు చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, కార్యదర్శి కత్తి లక్ష్మన్న, ఎర్రబల్లి వెంకటరమణ, పురుషోత్తం రెడ్డిశేఖర్, పి.శ్రీనివాసులు, వెంకటేష్, గురుమూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొమ్మలపాటి రమేశ్

కలసికట్టుగా చంద్రబాబును సీఎం చేద్దాం



నాగూర్‌వలి పుట్టినరోజు వేడుకల్లో సుగవాసిబాలసుబ్రమణ్యం తదితరులు

మదనపల్లె టౌన్, జనవరి 8: కలసి కట్టుగా పనిచేసి చంద్రబాబును మళ్లీ సీఎం చేద్దామని రాయచోటి టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సోమ వారం పట్టణంలో పలువురు ప్రముఖుల నివాసాలకు వెళ్లి పరిచయం చేసుకున్న ఆయన స్థానిక బెంగళూరు బస్టాండులోని టీడీపీ కార్యాల యంలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఇప్పటికే పలువురు వైసీపీ నేతలు టీడీపీవైపు చూస్తున్నారన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే అని, రాజంపేట పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ మైనారిటీ నేత నాగూర్‌వలి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు.

టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి

కురబలకోట, జనవరి 8: టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని టీడీపీ నేత ఎస్.సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అంగళ్ళలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడానికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, జనవరి 8: తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన మద్దిరెడ్డి కొండ్రెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సోమవారం తంబళ్లపల్లెలోని ఆయన స్వగృహంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం కొండ్రెడ్డి మాట్లాడుతూ తనకీ అవకాశం ఇచ్చిన చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడు, నారా లోకేష్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండ్రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

మదనపల్లె అర్బన్, జనవరి 8: టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఆర్ కళ్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న దశమహావిద్య సమేత మహారాజ శ్యామల చండీ హోమం సోమవారంతో ముగిసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయాలని సంకల్పంతో ఈ యాగం నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మార్పురి సుధాకర్‌నాయుడు, నాదెళ్ల విద్యాసాగర్, మైనార్టీ నాయకులు పఠాన్‌ఖాదర్‌ఖాన్, నాగూర్‌వలి, నీలకంఠ, కార్యకర్తలు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ నేతలు

దళితులకు ఇళ్ల స్థలాలు అప్పగించాలి



ధర్నా చేస్తున్న బహుజన నాయకులు, చిలకవారిపల్లె గ్రామస్థులు

మదనపల్లె టౌన్, జనవరి 8: మండలంలోని సీటీఎం-2 పంచాయతీ చిలకవారి పల్లె వద్ద దళితులకు కేటా యించిన ఇళ్ల స్థలాలను వారికే అప్పగిం చాలని బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట చిలకవారిపల్లె దళితులతో పాటు బహుజన సేన నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993లో చిలకవారిపల్లె వద్ద సర్వే నెంబర్ 656, 657/1లో ఎస్సీ, బీసీ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. ఆర్థిక కారణాలతో ఎస్సీలు వారికి కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకోలేకపోయారన్నారు. ఇప్పుడు ఈ గ్రామ సమీపంలో ఓ విద్యాసంస్థ ఏర్పాటు కావడంతో ఇళ్ల స్థలాలకు విలువ పెరగడంతో బీసీలు దౌర్జన్యంగా దళితుల ఇళ్ల స్థలాలను ఆక్రమించడమే కాక వారిపై భౌతికంగా దాడులు చేశారన్నారు. దీనిపై ఆర్డీవో చొరవ తీసుకుని దళితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వారికే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో మురళికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు ఆనంద్, నూర్‌అహ్మద్, రవి, నవీన్‌నాయక్ రూపక్, జెన్నిత్ గ్రామస్థులు శ్యామలమ్మ, అనసూయమ్మ, గంగులప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



రామసముద్రం ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామసముద్రం, జనవరి 8: రామసముద్రం మండలం దిన్నిపల్లె సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు సోమవారం జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలుపుతూ సాంప్రదాయ బద్దంగా తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. విద్యార్థుల చేత భోగి మంటలు, ముగ్గుల పోటీ, గాలిపటాలు ఎగరవేశారు. ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ మాట్లాడుతూ మకర సంక్రాంతి పండుగను ప్రతి సంవత్సరం పాఠశాలలో ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు, పాఠశాల ఛైర్మన్ గుణ శేఖర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: మండలంలోని ప్యారంపల్లె ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జ్యోతి, శ్రీనివాసులుపాల్గొన్నారు.

ములకలచెరువు: మండల కేంద్రంలోని శారదా పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి దాని చుట్టూ తిరుగుతూ విద్యార్థులు సందడి చేశారు. గంగిరెద్దును తీసుకొచ్చి ఆడించారు. మహిళకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు పాఠశాల కరెస్పాండెంట్ సనత్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ములకలచెరువులో విద్యార్థులకు భోగిపళ్లు పోస్తున్న ఉపాధ్యాయులు